క్లుప్తంగా

వేసవి శిబిరానికి విశేష స్పందన



యోగాలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

మాకవరపాలెం: ఉచిత వేసవి శిక్షణా శిబిరానికి విశేష స్పందన లభిస్తోంది. స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఈ నెల ఒకటో తేదీ నుంచి గౌతమి లలితకళా శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ నిర్వహిస్తున్నారు. నిత్యం ఉదయం 6 గంటలకు యోగా, 8 గంటలకు స్పోకెన్ ఇంగ్లిష్, సాయంత్రం 4 గంటలకు చదరంగం, 5 గంటలకు నృత్యం, కరాటే, 6 గంటలకు గణితంలో తమాషాలపై శిక్షణ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ శిక్షణకు అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరై శిక్షణ పొందుతున్నారు. సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోకుండా ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకుడు రంగరాజు కోరారు.

రైవాడ కాలువలో నాచు తొలగింపు



కెనాల్‌లో నాచు తొలగిస్తున్న లస్కర్లు

కె.కోటపాడు: ఉగ్గినవలస–కొరువాడ గ్రామాల మధ్య రైవాడ కాలువలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, నాచును తొలగింపు చర్యలు చేపట్టారు. రైవాడ నుంచి విశాఖ నగరానికి రోజూ 50 క్యూసెక్కుల నీరు సరఫరా అవుతోంది. ఈ కాలువ మార్గం అడుగు భాగంలో నాచు, మొక్కలు ఎక్కువగా పేరుకుపోవడం వల్ల నీటి ప్రవాహ వేగం మందగిస్తోంది. దీంతో జీవీఎంసీ అధికారులు కెనాల్ మార్గంలో ఆదివారం నుంచి లస్కర్లతో వీటిని తొలగించే పనులు చేపడుతున్నారు.

బీఎస్ఎన్ఎల్ సేవలకు అంతరాయం



సరుగుడులో బీఎస్ఎన్ఎల్ సెల్ టవరు

నాతవరం: సరుగుడులో బీఎస్ఎన్ఎల్ టవరు సరిగ్గా పని చేయకపోవడంతో ఈ సేవలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. సెల్ టవర్‌పై ఆధారపడి సరుగుడు, సుందరకోట పంచాయతీల పరిధిలో 16 గ్రామాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొద్దిపాటి వర్షం పడి ఈదురు గాలులు వీచినా సెల్ టవరు నుంచి సిగ్నల్స్ నిలిచిపోతున్నాయి. మూడు రోజులుగా సిగ్నల్స్ అందక సరుగుడు గ్రామ సచివాలయంలో ప్రజలకు సకాలంలో ప్రభుత్వ సేవలు అందడంలేదు. ప్రైవేటు వ్యాపారులు, ఉపాధి వేతనదారులు అవస్థలు పడుతున్నారు. సరుగుడు మినీ బ్యాంకు ద్వారా సకాలంలో వ్యాపార లావాదేవీలు నిర్వహించలేకపోతున్నారు. వేతనదారులు ఉపాధి కూలి డబ్బులు పొందలేకపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

కె.జె.పురంలో తోడపెద్దు మృతి



తోడపెద్దు కళేబరం వద్ద విషణ్ణ వదనంలో వేగి కుటుంబ సభ్యులు

మాడుగుల రూరల్: కె.జె.పురంలో తోడపెద్దు ఆదివారం సాయంత్రం మృతి చెందింది. 2007 నుంచి ఏటా ధనుర్మాసంలో సంక్రాంతి, మహాశివరాత్రి ఉత్సవాల వరకు గ్రామంతోపాటు సుదూర ప్రాంతాల్లో ఉత్సవాలు, తీర్థాలకు తోడపెద్దు సేవ చేసేవారు. ఈ నేపథ్యంలో పది రోజుల నుంచి ఆరోగ్యం క్షీణించింది. పశువైద్యాధికారులు వైద్య సేవలందించారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో తుది శ్వాస విడిచింది. తోడపెద్దు మృతితో వేగి వారి కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. గ్రామంలో ప్రజలు, సింహాద్రప్పన్న భక్తులు విచారం వ్యక్తం చేశారు.

వైభవంగా వేంకటేశ్వర కల్యాణ మహోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



ధ్వజారోహణ కార్యక్రమం జరుగుతున్న దృశ్యం



వడ్డాదిలో సర్వమంగళాదేవి, రామలింగేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

మాడుగుల: స్థానిక పురాతన వేంకటేశ్వరస్వామి ఆలయంలో తిరు కల్యాణ మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. మహరాజుల పాలన నుంచి ఈ కల్యాణోత్సవాలు అలనాటి సంప్రదాయం ప్రకారం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ధ్వజారోహణ, ఇత్యాది పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 24న సాయంత్రం పుష్పాంజలి సేవతో తిరువీధి కల్యాణోత్సవాలు పాలకుర్తి సురేష్‌కుమార్, పుట్టా బలరామ్, నూతిగట్టు నాగశంకర్, కరణం శ్రీనువాసరావు దంపతులు, గ్రామ పెద్దలు సహకారంతో నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి ఎస్.వి.వి.సత్యనారాయణ తెలిపారు.

వడ్డాదిలో ఘనంగా వేంకటేశ్వర కల్యాణ మహోత్సవం

బుచ్చెయ్యపేట: మండలంలోని పలు గ్రామాల్లో వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలను ఆయా గ్రామాల ప్రజలు, అర్చకులు, దేవస్థానం అధికారులు ఘనంగా నిర్వహించారు. చంద్రమాన క్రోధి నామ సంవత్సర వైశాఖ శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆదివారం వడ్డాది, బుచ్చెయ్యపేట, విజయరామరాజుపేట తదితర గ్రామాల్లో వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వడ్డాది శారదానది ఒడ్డున 182 ఏళ్లనాటి పురాతన ఆలయం సర్వమంగళాదేవి, రామలింగేశ్వరస్వామి కల్యాణాన్ని అర్చకులు దొంతుకుర్తి సంతోష్‌కుమార్, టి. నాగేశ్వరరావు నిర్వహించారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

రావికమతం: వైశాఖ శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా ప్రసిద్ధి చెందిన కొత్తకోట శివ కేశవ ఆలయంలో కొలువైన రాజరాజేశ్వరి సమేత రాజలింగేశ్వర స్వామివారికి, కేశవాలయంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీకేశవ స్వామివారికి కల్యాణ మహోత్సవం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. శనివారం పెండ్లి రాట వేసి కల్యాణ తంతు ప్రారంభించారు. ఆదివారం ఉదయం స్వామివార్ల కల్యాణాలను అర్చకులు విజయ భాస్కర్, ఎస్.ఆర్.ఎల్.జె. శాస్త్రి ఆధ్వర్యంలో గుమ్మడు దొరబాబు, పెనుగొండ నానాజి దంపతులతో నిర్వహించారు. గ్రామం నుంచే కాక పలు గ్రామాల నుంచి భక్తులు, మహిళలు పెద్ద ఎత్తున హాజరై కల్యాణాన్ని తిలకించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



కామేశ్వరమ్మ ఆలయం వద్ద కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మాకవరపాలెం: పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఉత్సాహంగా సాగింది. స్థానిక ఉన్నత పాఠశాలకు చెందిన 2002–03 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులంతా రాచపల్లి జంక్షన్‌లో కామేశ్వరమ్మ ఆలయం వద్ద ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారంతా 20 ఏళ్ల క్రితం నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. ఒకరికి ఒకరు యోగక్షేమాలతోపాటు ప్రస్తుతం వారు స్థిరపడిన రంగాలను తెలుసుకున్నారు. అనంతరం వారంతా ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ప్రథమ స్థానం సాధించిన లాలం కామేశ్వరికి రూ.2 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన గురాల రేష్మకు రూ.1,500, తృతీయ స్థానం కైవసం చేసుకున్న సూర్రెడ్డి ఉందుకు రూ.వెయ్యి ప్రోత్సాహకాలుగా అందజేశారు. 80 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎం. కోడూరులో ఘనంగా మోదకొండమ్మ పండగ



మోదకొండమ్మకు పూలమాల వేస్తున్న సర్పంచ్ సంజీవిరావు, అప్పలనాయుడు



అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు

మాడుగుల రూరల్: ఎం.కోడూరులో మోదకొండమ్మ పండగ ఆదివారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము 6 గంటల నుంచి అమ్మవారికి పసుపుకుంకుమ, అభిషేకాలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, ప్రభావతి దంపతులు తొలిపూజ చేసి పట్టువస్త్రాలు సమర్పించారు. అమ్మవారిని పూలమాలలతో అలంకరించారు. గ్రామస్తులతోపాటు చుట్టు పక్కల గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద దాతలు మజ్జిగ పంపిణీ చేశారు. సాయంత్రం నుంచి నేల వేషాలు, తప్పెట గుళ్ల, చిటికెల భజనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. గ్రామ వీధుల్లో విద్యుద్దీపాలంకరణతోపాటు భారీ స్థాయిలో బాణసంచా పేల్చారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకున్నారు. శనివారం రాత్రి ఏనుగుల ఊరేగింపు, 101 డప్పులు, కాగడాల ప్రదర్శన నిర్వహించారు.

నేల రాలిన మామిడి, జీడి

అకాల వర్షాలకు నష్టపోయిన రైతులు

చోడవరం: అకాల వర్షాలతో మామిడి, జీడి పంటలకు దెబ్బమీద దెబ్బ తగిలింది. ఈ ఏడాది సీజన్ ప్రారంభం నుంచీ పొగమంచు విపరీతంగా పడటంతో ఈసారి మామిడి పూతే అంతంతమాత్రంగా పూచింది. నాలుగు రోజులుగా ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం కురవడంతో పంట చాలా మేర దెబ్బతింది. దీంతో మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చోడవరం, బుచ్చెయ్యపేట మండలాల్లో 500 ఎకరాల్లో మామిడి, జీడిమామిడి పంటకు ఈదురుగాలుల కారణంగా నష్టం వాటిల్లింది. ఈ ఏడాది మొదట్లో పూత బాగా వచ్చినప్పటికీ వర్షాలు కురవకపోవడంతో పొగమంచు కమ్ముకుంది. మంచువల్ల చాలా మేర పూత రాలిపోయింది. దీంతో ఆలస్యంగా పిందెలు వచ్చాయి. కనీసం ఆ పంటైనా చేతికి వస్తే పెట్టుబడులైనా వస్తాయని రైతులు ఆశించారు. ఇప్పుడు పక్వానికి చేరుకుంటున్న సమయంలో ఒక్కసారిగా భారీ ఈదురు గాలులతో కురిసిన వర్షం మామిడి రైతులను నిండా ముంచేసింది. పెద్ద ఎత్తున గాలులు వీయడంతో కాయదశలో ఉన్న మామిడి పంట అంతా నేల రాలిపోయింది. చోడవరం, బుచ్చెయ్యపేట ప్రాంతాల్లో తోటల్లో 20 శాతం పంట నేల రాలిపోయింది. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి తోటలు లీజుకు తీసుకున్న రైతులు, స్వతహాగా తోటలు కాపుకాస్తున్న రైతులు ఈదురు గాలులతో తీవ్రంగా నష్టపోయారు. గాలులు గట్టిగా వీయడంతో నేలరాలిన కాయలన్నీ పగిలో పోయాయి. కనీసం అమ్మకానికి కూడా వీలు లేకుండా పంట నష్టం వాటిల్లింది. ఈ సీజన్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న మామిడి రైతుల ఆశలు నిరాశయ్యాయి. రైతులంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి తెలుగు భాషా శిక్షణ

మునగపాక : మునగపాక పంచాయతీ కార్యాలయం దరి సోమవారం నుంచి తెలుగు భాషపై పట్టు సాధించేందుకు అవసరమయ్యే శిక్షణ కార్యక్రమం ప్రారంభమవుతుందని యువ రచయిత విల్లూరి జగ్గప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగులో రాయడం, చదవడం వంటి అంశాలపై పూర్తిస్థాయి శిక్షణ ఇస్తామన్నారు. తెలుగు భాష అధ్యయన వేదిక పేరుతో నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అక్షరాలు, ఒత్తులు పలికే విధానం, రాసే విధానం వంటి విషయాలపై శిక్షణ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9182259317 ఫోన్ నంబరును సంప్రదించాలని జగ్గప్పారావు కోరారు.

‘పెండింగ్ బకాయిలు చెల్లించాలి’




మాట్లాడుతున్న బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు

తుమ్మపాల: రాష్ట్రంలో విశ్రాంత, విధుల్లో ఉన్న టీచర్ల బకాయిలను వెంటనే చెల్లించేందుకు అధికారులు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు కోరారు. పట్టణంలోని రింగురోడ్డులో ఉన్న పీఆర్టీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్సీ, డీఏ బకాయిలను విడుదల చేయాలన్నారు. 2018 నుంచి గ్రాట్యూటీ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. 70 ఏళ్లు దాటిన విశ్రాంత సిబ్బందికి వర్తించే క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను 10 శాతానికి పెంచాలన్నారు. బోధనేతర విధుల నుంచి ఉపాధ్యాయులను పూర్తిగా తొలగించాలని కోరారు. నాడు నేడు, పలు అంశాల్లో పనులను ఇంజినీరింగ్, ఇతర అధికారులకు అప్పగించాలన్నారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు వరు, బాబ్జీ, కామేశ్వరరావు, మూర్తి, గంగాధర్, జనార్దన్, రమేష్ సత్యనారాయణ పాల్గొన్నారు.

మోదమాంబ కొలువు ప్రారంభం



మోదమాంబ కొలువు ఏర్పాటు చేస్తున్న గురుమాత శ్రీనివాసరావు



ప్రత్యేక అలంకరణలో కె.జె.పురం మోదమాంబ



అమ్మవారికి పూజలు చేస్తున్న మాలాధారణ భక్తులు

మాడుగుల రూరల్: వీరవల్లి అగ్రహారంలో మోదమాంబ కొలువు ఆదివారం ప్రారంభమైంది. గురుమాత పాలకుర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పది మంది భక్తులు మోదమాంబ మాలాధారణ చేశారు. వీరి సారథ్యంలో పాలకుర్తి శ్రీనివాసరావు ఇంట్లో అమ్మవారి కొలువు ఏర్పాటు చేశారు. రోజు ఉదయం, సాయంత్రం పూజలు, క్షీరాభిషేకం నిర్వహించనున్నారు. 29 రోజులపాటు మాలాధారణ అనంతరం వచ్చే నెల 18వ తేదీన మాడుగుల అమ్మవారి ఆలయం వద్ద మాలాధారణ త్యజిస్తామని ఆయన తెలిపారు. మాడుగులకు చెందిన 40 మంది భక్తులు ఆదివారం మాలాధారణ చేశారు.

కె.జె.పురంలో మోదమాంబకు పూజలు

మాడుగుల రూరల్: కె.జె.పురం గ్రామ ఆరాధ్య దైవం మోదమాంబ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నిర్వహించారు. అమ్మవారి మాలాధారణ భక్తులు పూజలు నిర్వహించారు. సాయంత్రం నుంచి భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో భక్తులకు చద్ది ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు దేశభక్తి గేయాల పోటీలు



దేశభక్తి గీతాల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



బాలలతో ఆటలాడిస్తున్న గ్రంథపాలకురాలు వరహామణి

కె.కోటపాడు: దేశభక్తిని విద్యార్థులు పెంపొందించుకోవాలని గ్రంథాలయాధికారి ఎం.పద్మావతి తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం చౌడువాడ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు దేశభక్తి గీతాలపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులను ఏ విధంగా గౌరవిస్తామో.. దేశాన్ని అదేవిధంగా ప్రేమించాలని తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరాన్ని వచ్చే నెల 7వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమం ముగింపు రోజున ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

బాల బాలలకు ఉత్సాహంగా ఆటల పోటీలు

రావికమతం: కొత్తకోట శాఖా గ్రంథాలయంలో బాల బాలికలకు ఉత్సాహంగా ఆటలు పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 15 నుంచి ఇక్కడ వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వచ్చే పిల్లలకు ఆట పాటలతో పుస్తకాలు చదివించడమే కాక కథలు చెబుతున్నారు. వారికి ఏయే కళల పట్ల మక్కువ ఉందో తెలుసుకుని వాటిలో తర్ఫీదు ఇస్తున్నారు. ఈ క్రమంలో పోటీలు నిర్వహిస్తున్నామని వచ్చే నెల 7న ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని తెలిపారు.

కుల వివక్షపై పుచ్చలపల్లి ఎనలేని పోరాటం



పుచ్చలపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



దేవరాపల్లిలో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వెంకన్న

కె.కోటపాడు: దక్షిణ భారతదేశంలో కుల వివక్షపై పుచ్చలపల్లి సుందరయ్య ఎనలేని పోరాటం చేశారని సీపీఎం నాయకుడు యర్రా దేముడు, గండి నాయినిబాబు, గాడి ప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. పోరాటాల ద్వారా సామాన్యులకు అండగా నిలిచిన పుచ్చలపల్లి చిరస్మరణీయులని అన్నారు. పుచ్చలపల్లిని ఆదర్శంగా తీసుకుని శ్రామిక, కార్మిక, కర్షకులకు అండగా నిలిచేందుకు సీపీఎం పోరాటాన్ని కొన సాగిస్తుందన్నారు.

దేవరాపల్లి: సీపీఎం మొదటి జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందర య్య 39వ వర్ధంతి ఆదివారం దేవరాపల్లిలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న, మండల కార్యదర్శి బి.టి.దొర మాట్లాడుతూ పార్లమెంటుకు, అసెంబ్లీకి సైకిల్‌పై వెళ్లిన గొప్ప ఆదర్శమూర్తి సుందరయ్య అన్నారు. మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉద్యమాలు చేపట్టారని కొనియాడారు. అనంతరం ఆయన జ్ఞాపకార్థంగా జెండాను ఎగుర వేశారు. నాయకులు సిహెచ్ లక్ష్మణ, కె.సన్యాసి, డి.శంకర్, సిహెచ్ దేముడు, కె. ఈశ్వరరావు, జె. ఈశ్వరరావు, నాగేశ్వరరావు, గోపాల్ పాల్గొన్నారు.

కంటి సమస్యలపై అప్రమత్తత అవసరం

అనకాపల్లి: నేత్ర సమస్యలతో బాధపడే వ్యక్తులు ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువ తీసుకోవాలని నయన నేత్రాలయం వైద్యుడు దాడి పరమేశ్వరరావు సూచించారు. స్థానిక రింగ్‌రోడ్డు ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డు గుమస్తాల సంఘం కార్యాలయంలో క్లబ్ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. సమావేశంలో కంటి వ్యాధులు, నివారణోపాయాలుపై ఆయన మాట్లాడారు. ప్రస్తుతం అన్ని వయసులవారు సెల్‌ఫోన్, కంప్యూటర్ ఎక్కువగా వాడడంతో కంటి సమస్యలు వస్తున్నాయని, అలాంటి వారు అల్ట్రావైలెట్ గ్లాసేను కంటికి రక్షణగా వాడాలని సూచించారు. 40 ఏళ్లు పైబడిన ప్రతి వ్యక్తి ఏడాదికోసారి కంటి పరీక్షలు చేయించుకుని, వైద్యుల సూచనల మేరకు అద్దాలను మార్చుకోవాలన్నారు. చిన్నపిల్లలు సెల్‌ఫోన్ ఎక్కువగా వాడడంతో కంటి సమస్యలు తలెత్తే అవకాశాలున్నాయన్నారు. మరణించిన వ్యక్తికి చెందిన కళ్లను 6 గంటల్లోపు దానం చేస్తే చూపులేని మరో ఇద్దరికి చూపును ప్రసాదించవచ్చన్నారు. సమావేశంలో క్లబ్ అధ్యక్షుడు భీశెట్టి రామకృష్ణ, కార్యదర్శి యల్లపు సాంబశివరావు, సభ్యులు రాపేటి నారాయణరావు, డీడీ నాయుడు, ఆడారి మల్లికార్జునరావు, కేవీ గౌరీపతి, కేవీవీ సత్యనారాయణ, నల్లల దేముళ్లు, ఆళ్ల ఓంరామ్, కోటేశ్వరరావు, కె.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

చెరకు నాట్లకు మేలు చేసిన వర్షం



రోలుగుంటలో కురుస్తున్న వర్షం



ఎ.భీమవరంలో చెరకు నాట్లు వేసిన పొలం

కె.కోటపాడు: అడపాదడపా కురిసిన వర్షాలు పొలాల్లో వేసిన చెరకు నాట్లకు మేలు చేకూర్చాయి. రెండు నెలలుగా వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో ఎంత తీవ్రతకు ప్రజలు అల్లాడిపోయారు. ఇప్పుడు కురుస్తున్న వర్షాలతో ఉపశమనం పొందుతున్నారు. మరోవైపు మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ బావులు, మోటార్ల నీటితో చెరకు నాట్లు వేశారు. ప్రస్తుతం కురిసిన వర్షాలు చెరకు సాగుకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చౌడువాడ, పైడంపేట, గుల్లేపల్లి, మల్లంపాలెం, కె.కోటపాడు, గొండుపాలెం, రొంగలినాయుడుపాలెం, మేడిచర్ల, ఎ.భీమవరం, పాడుగుపాలెం, ఎ.కోడూరు, సూర్రెడ్డిపాలెం, సింగన్నదొరపాలెం గ్రామాల్లో 350 ఎకరాల్లో చెరుకు నాట్లు వేశారు.

రోలుగుంటలో వర్షం

రోలుగుంట: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం వర్షం కురిసింది. ఈ వేసవిలో ఎన్నడూ లేని విధంగా ఎండలు తీవ్రంగా కాశాయి. దీంతో రైతులు వర్షం కోసం చూస్తున్న తరుణంలో గత వారం కురిసిన వర్షాలు భూముల్లో పదును ఏర్పడి దుక్కులు చేస్తున్నారు. కుసుర్లపూడి, రోలుగుంట, శరభవరం, నిండుగొండ తదితర గ్రామాల్లో 800 ఎకరాలకుపైగా బొబ్బర్లు, కంది, పెసర, మినప తదితర అపరాల విత్తనాలను జల్లారు. ఆ తర్వాత ఎండలు కాసి ఆదివారం వర్షం కురవడంతో విత్తనాలు మొలకెత్తుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మాడుగులలోనూ...

మాడుగుల రూరల్: అడపా దడపా కురుస్తున్న వర్షాలతో ఖరీఫ్ పనులకు రైతులు శ్రీకారం చుట్టారు. ఆదివారం మధ్యాహ్నం స్వల్పంగా వర్షం కురిసింది. ఈ వర్షం వల్ల చెరకు నాట్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. దీంతోపాటు వరినారు మడులు సిద్ధం చేస్తున్నారు.

రావికమతంలో భారీ వర్షం

రావికమతం: మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. గాలులు లేకుండా ఏకధాటిగా గంట పాటు భారీ వర్షం కురవడంతో రావికమతం, కొత్తకోట, తదితర గ్రామాల్లో వీధి కాలువలు ఉప్పొంగి రహదారులపై నుంచి ప్రవహించాయి. కొత్తకోటలో కోటవీధి రామ మందిరంలోకి పెద్ద ఎత్తున నీరు చేరింది. మూడు రోజుల క్రితం పెద్ద వర్షం కురిసింది. మళ్లీ ఇప్పుడు భారీ వర్షం కురవడంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. వరుసగా వర్షాలు కురవడంతో మండే ఎండా కాలం ఒక్కసారిగా చల్లబడిపోయింది. ఎండలకు విలవిల్లాడిన ప్రజలు చల్లని వాతావరణానికి ఎంతగానో సేద తీరుతున్నారు.

ఘనంగా గ్రీన్ క్లబ్ దశాబ్ది వేడుకలు

అనకాపల్లి: పర్యావరణ పరిరక్షణ, వేసవిలో ఇంటి గూటి పక్షులను కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి యువతరంపై ఉందని గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ అన్నారు. స్థానిక గాంధీనగరం లయన్స్ క్లబ్ ఆవరణలో గ్రీన్ క్లబ్ దశాబ్ది వేడుకలను శనివారం రాత్రి ప్రముఖ సంఘ సేవకులు కర్రి సన్యాసినాయుడు, విశ్రాంత అటవీశాఖ అధికారి బీరా వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో స్థాపించిన గ్రీన్ క్లబ్ ద్వారా సభ్యుల సహకారంతో ప్రతీనెల జిల్లాలో పర్యావరణంపై అవగాహన కార్యక్రమాలు, ఉచిత మొక్కల పంపిణీ, ఇంకుడు గుంతల నిర్వహణ, పక్షుల సంరక్షణపై అవగాహన తదితర కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.